సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్ధేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్)

సురేశ్ (ఫైల్)

హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడు వాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామవాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

ఉగ్రరూపం దాల్చిన ఆపరేషన్ 'కగార్'
ఓర్చా అడవుల్లో 31 మంది మృతదేహాలు స్వాధీనం
వివరాలు వెల్లడించిన బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్
మృతుల్లో రూ.25 లక్షల రివార్డున్న డీకేజెడ్‌సీ ఊర్మిళ
మరికొందరు ముఖ్య నాయకులూ హతం
ఇప్పటి వరకు గుర్తించిన వారిపై రూ.1.30 కోట్ల రివార్డులు

దండకారణ్యంలో 'అంతిమ'యాత్ర!

భద్రతా దళాలు స్వాధీనపరుచుకున్న మావోయిస్టుల మృతదేహాలు, దండకారణ్యంలో మహిళా జవాన్లు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 5: దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్నాయి. తూటాల గర్జనలు 'తిరుగుబాటు'ను తీరాలు దాటిస్తున్నాయి. సరి'హద్దు'లు దాటిన సైన్యాల బూట్ల శబ్దాలు గుబులు పుట్టిస్తున్నాయి. నక్సల్స్ కంచుకోటలు కుప్పకూలేలా ఆపరేషన్ 'కగార్' కొనసాగుతోంది. భద్రతా బలగాలు దండకారణ్యంలోకి చొచ్చుకెళ్తున్నాయి. 'అంతిమ'యాత్రలా కొనసాగుతున్న బలగాల దూకుడుతో ఇరువర్గాల మధ్య పోరు వాతావ'రణం' నెలకొంది.

ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య శుక్రవారం జరిగిన భీకరపోరులో సాయుధ నక్సలైట్లు పెద్ద సంఖ్యలో మృతిచెందిన విషయం విదితమే. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం శనివారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆ వివరాలను ధ్రువీకరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ - దంతేవాడ జిల్లా సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేతలు సమావేశమయ్యారన్న కీలక సమాచారం పోలీస్ అధికారులకు అందింది. ఈ మేరకు మూడు రోజుల నుంచి ఆయా ప్రాంతాల్లో దంతేవాడ డీఆర్‌జీ బలగాలు, నారాయణ్‌పూర్ సీఆర్‌పీఎఫ్ - కోబ్రా, డీఆర్‌జీ, ఎస్‌టీవో బలగాల సంయుక్త ఆధ్వర్యంలో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ క్రమంలో నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెండూర్ - తులతులీ గ్రామల మధ్య గల అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు తారసపడి కాల్పులకు దిగారు. జవాన్లు వెంటనే అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య రెండు గంటల పాటు జరిగిన భీకరపోరు తరువాత జవాన్ల తాకిడిని తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అడవిలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతంలో గాలింపులు చేపట్టగా 31 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. నాలుగు ఏకే-47లు, ఒక ఎల్ఎంజీ, ఆరు ఎస్ఎల్ఆర్ తుపాకులు, మూడు ఇన్‌సాస్ రైఫిల్, రెండు 303 రైఫిళ్లతోపాటు పెద్ద ఎత్తున ఇతర మారణాయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీన పర్చుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు గాలింపు కొనసాగింది. మృతిచెందిన మావోయిస్టులు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 6వ నెంబర్ కంపెనీ, తూర్పు బస్తర్ డివిజన్‌కి చెందినవారిగా గుర్తించినట్లు ఐజీ సుందర్‌రాజ్ ధ్రువీకరించారు. మృతిచెందిన వారిలో రూ.25 లక్షల రివార్డున్న దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేజెడ్‌సీ) సభ్యురాలు, తూర్పు బస్తర్ డివిజన్ ఇన్‌చార్జి నీతి అలియాస్ ఊర్మిల ఉన్నట్లు ఆయన తెలిపారు. అంతేగాకుండా మృతుల్లో ఇద్దరు డివిజినల్ కమిటీ మెంబర్ (డీవీసీఎం)లు సురేశ్ సలాం, మీనా మడకం ఉన్నారన్నారు. వీరిలో ఒకొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉందని, పీఎల్‌జీఏ 6వ నెంబర్ కంపెనీకి చెందిన 9 మంది ఉన్నారని వివరించారు. వీరిలో కూడా ఒకొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉందని, తూర్పు బస్తర్ డివిజన్‌కి చెందిన ఒకొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉన్న ముగ్గురు ప్లాట్‌ఫామ్ పార్టీ కమిటీ మెంబర్ (పీపీసీఎం)లు ఉన్నారని ధ్రువీకరించారు. ఇప్పటి వరకు గుర్తించిన మృతులపై రూ.1.30 కోట్ల రివార్డు ఉందని, మిగతా వారి వివరాలు ఆధారంగా రివార్డు ప్రకటిస్తామని తెలిపారు. మృతిచెందిన 31 మంది మావోయిస్టుల్లో 13 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు.

ఉగ్రరూపంగా ఆపరేషన్ 'కగార్'

మావోయిస్టులను నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ 'కగార్'ను వేగవంతం చేశాయి. కగార్ అంటే అంతిమ దశ అనే అర్థాన్ని సూచిస్తోంది. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా ఉన్న మావోయిస్టుల కంచుకోటను ఇదే లక్ష్యంతో కూల్చేందుకు 'డబుల్ ఇంజిన్' సర్కార్ ప్రత్యేక బలగాలతో చుట్టుముట్టింది. ఓ వైపు మావోయిస్టులు.. కోల్పోతున్న తమ ఉనికిని కాపాడుకునేందుకు ఇన్ఫార్మర్ నెపంతో ఏజెన్సీ ఆదివాసీలను చావుదెబ్బ కొడుతున్నారు. మరోవైపు ఉపద్రవంలా ఉగ్రరూపం దాల్చిన ఆపరేషన్ 'కగార్' వాయువేగంతో అడవుల్లోకి చొచ్చుకుపోయి యుద్ధం ప్రకటిస్తోంది. ఈ క్రమంలోనే ఎంతోమంది మావోయిస్టులను భద్రతా దళాలు మట్టుబెడుతున్నాయి. ఈ ఒక్క ఏడాదిలోనే బస్తర్ రేంజ్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల్లో సుమారు 188 మంది మావోయిస్టులు నేలరాలారు. ఈ పరిణామాలు యుద్ధం 'అంతిమ'దశకు చేరుకున్నట్లు సూచిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎదురుకాల్పుల్లో ముఖ్య నాయకులను మావోయిస్టు పార్టీ కోల్పోవడం దానికి పెద్ద ఎదురుదెబ్బ.

2026 నాటికి సమూలంగా నిర్మూలించేలా..

ఇదిలా ఉండగా ఈ ఏడాదిలోనే ఏప్రిల్ 16న బస్తర్ డివిజన్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో రూ.25 లక్షల రివార్డున్న మావోయిస్టు పార్టీ కీలక నేత శంకర్‌రావు మృతిచెందారు. తాజాగా నెండూర్ - తులతులి అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో వందకు పైగా ఉన్న సాయుధ మావోయిస్టులపై వెయ్యికి పైగా భద్రతా దళాలు చుట్టుముట్టి దాడులు నిర్వహించాయి. ఒక్క ఏడాదిలోనే బస్తర్ రేంజ్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఈ రెండు ఘటనల్లో మావోయిస్టు పార్టీకి అతి పెద్ద నష్టం వాటిల్లింది. ఇదే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2026 నాటికి మావోయిస్టు పార్టీని సమూలంగా నిర్మూలించే దిశగా పావులు కదుపుతున్నాయి. రానున్న రోజులు మావోయిస్టు పార్టీకి గడ్డుకాలంగా మారనున్నాయని ప్రస్తుత ఎన్‌కౌంటర్ల గణంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే వందల సంఖ్యలో మావోయిస్టు పార్టీకి చెందిన నాయకులు, దళ సభ్యులు, సానుభూతిపరులు, మిలీషియా సభ్యులు సైతం వివిధ కారణాలతో లొంగుబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టు నాయకులు సైతం ఇన్ఫార్మర్ నెపంతో సొంత పార్టీకి చెందిన క్యాడర్లను సైతం హత్య చేయడం ఆ పార్టీకి చేదు అనుభవమే. మావోయిస్టు పార్టీ ఏవోబీ నాయకురాలు నీల్సో హత్యతో ఆ పార్టీపై ప్రజల్లో కొంత వ్యతిరేకత వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మావోయిస్టు పార్టీ నాయకులు ప్రతీకారేచ్ఛతో భద్రతా దళాలపై యుద్ధం ప్రకటిస్తూనే.. ఇన్ఫార్మర్ నెపంతో హత్యకాండకు పాల్పడుతోంది. అయితే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర హోంమంత్రి ఇటీవల చర్చలకు పిలుపునిచ్చారు. అందుకు మావోయిస్టు పార్టీ కూడా సానుకూలంగా స్పందించింది. కానీ ఇదే సమయంలో కేంద్రం ఆపరేషన్ 'కగార్' దూకుడు పెంచడంతో మళ్లీ యుద్ధవాతావరణం అలుముకుంది. ప్రస్తుతం ఎదురవుతున్న పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయోనని ఆదివాసీలు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, తాజా ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా బలగాల్లో మహిళా జవాన్లు కూడా ఉన్నారు.

రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి: ఎంఆర్‌పీఎస్

మాట్లాడుతున్న కూరపాటి సునీల్‌మాదిగ

బోనకల్లు, అక్టోబర్ 5: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహిగా వ్యవహరిస్తున్నారని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్‌మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందని, రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి అని, రేవంత్‌రెడ్డి మాటల్లో ఉన్న నీతి చేతల్లో లేదన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ సర్కారుకు నిరసన సెగ తప్పదని హెచ్చరించారు. ఈ నెల 9న ఖమ్మం జిల్లా కేంద్రంగా డీఎస్సీ నియమకాలకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. చిలక నాగరాజు, కోట హనుమంతరావు, తోటపల్లి చిన్నసైదులు, తాళ్లూరు ప్రకాష్, మర్రి కరణం, గద్దల రవీంద్ర, గద్దల ఉపేందర్ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ

శిక్షణ ఇస్తున్న మిషన్ భగీరథ డీఈఈ శ్రీనివాసరావు

మధిర, అక్టోబర్ 5: మధిర వ్యవసాయ మార్కెట్ సమీపంలోని రైతువేదికలో మిషన్‌భగీరథ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ మంచినీటి సరఫరా సహాయకులకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డీఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 4 నుంచి 8 వరకు మండలంలోని 27 పంచాయతీలు, ఎర్రుపాలెం మండలంలోని 31 పంచాయతీల మంచినీటి సహాయకులకు, సిబ్బందికి నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏఈఈ మురళీధర్, క్యూసీ ఏఈ రామలింగేశ్వరరావు, కన్సల్టెంట్ రమ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ట్రయత్లాన్‌కి జ్యోతిరావుపూలే విద్యార్థి

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 5: రాష్ట్రస్థాయి ట్రయత్లాన్ క్రీడల్లో మండలంలోని నాయకునుగూడెం జ్యోతిరావుపూలే గురుకుల విద్యార్థి విష్ణుష్ అత్యత్తుమ ప్రతిభ కనబరచి ఎంపికయ్యాడు. శనివారం ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన అండర్-14 విభాగంలో ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విష్ణుష్‌ను ఆర్సీవో బ్యూలారాణి, డీసీవో జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్ మల్లయ్య, ఏటీపీ లలిత, డిప్యూటీ వార్డెన్ శేషగిరి, పీఈటీ బ్రహ్మాచారిలు అభినందనలు తెలిపారు.

ఇద్దరు జడ్జీలకు పదోన్నతి

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 5: కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి.. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కొత్తగూడెం సెక్రటరీగా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు.. కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. వీరిద్దరూ జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు అభినందించారు.

- తీవ్ర నిరాశలో స్పెషల్ డీఎస్సీ ఎడ్యుకేషన్ ఉద్యోగార్థులు
- జాబితా రాని కారణంగా వెరిఫికేషన్‌కు దూరం

ముగిసిన డీఎస్సీ కౌన్సెలింగ్

వెరిఫికేషన్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ప్రత్యేక విద్య అభ్యర్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 5: నాలుగు రోజులుగా కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ఎట్టకేలకు శనివారంతో ముగిసింది. కానీ జాబితారాని కారణంగా స్పెషల్ డీఎస్సీ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరగలేదు. దివ్యాంగ విద్యార్థుల విద్యా బోధన కోసం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో రాష్ట్రవ్యాప్తంగా సరాసరి 900 పోస్టుల కోసం పరీక్ష నిర్వహించి మెరిట్ లిస్టు విడుదల చేసిన విషయం విదితమే. ఇందులో ఖమ్మం జిల్లాలో 27 ఎస్జీటీ, 8 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. అయితే డీఎస్సీ-2024అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటే ఈ స్పెషల్ డీఎస్సీ ఎడ్యుకేషన్ అభ్యర్థుల సర్టిఫికెట్లు కూడా వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. కానీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసినా వీరి ధ్రువపత్రాల పరిశీలన మాత్రం జరగలేదు. ఈ క్రమంలో స్పెషల్ డీఎస్సీ ఎడ్యుకేషన్